

నేడు గోరుకల్లుకు అధికారుల బృందం

నంద్యాల మున్సిపాలిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి శాఖకు చెందిన సాంకేతిక అధికారుల బృందం మంగళవారం గోరుకల్లు రిజర్వాయర్‌ను సందర్శించనుంది. తనిఖీ అధికారుల్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన ఐదుగురు ఇంజనీర్లతో పాటు స్టేట్ డ్యాం సేఫ్టీ ఆఫీసర్, మరో ముగ్గురు ఇంజనీర్లు ఉంటారు. వీరు గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలించి రిజర్వాయర్ పటిష్టతకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. అధికారుల సందర్శన నేపథ్యంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు గోరుకల్లు ఈఈ శుభ కుమార్ తెలిపారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్

పీజీఆర్ఎస్‌కు 203 దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్‌కు 203 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. రీ ఓపెన్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులు అర్జీల నమోదు, ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌కు రావాలని సూచించారు. వినతుల్లో ఎక్కువశాతం రెవెన్యూశాఖకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మనమిత్ర క్యాంపెయిన్ 4శాతం పెండింగ్‌లో ఉందన్నారు. ఆళ్లగడ్డ రూరల్, నందికొట్కూరు అర్బన్, డోన్ అర్బన్, పగిడ్యాల మండలాల్లో 26,052 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు 975 మార్గదర్శులను గుర్తించామని, పెండింగ్‌లో ఉన్న మరికొన్నింటిని పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా

సిద్ధం చేయండి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకానికి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె చాంబర్‌లో పీఎం సూర్యఘర్, హౌసింగ్, ఉపాధి హామీ పనులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద కేటాయించిన లక్ష్యంలో జిల్లాలో ఇప్పటివరకు 1,10,348 మంది వినియోగదారులు నమోదుచేసుకోగా 87,862 దరఖాస్తులు అర్హత పొందాయని, మిగతా వాటిని పరిశీలించి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12న సీఎం చంద్రబాబు ఇళ్లను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన 9,432 గృహాల నిర్మాణాలను ఈ నెల ఆఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి వేతనదారుల సరాసరి దినసరి రేటును గణనీయంగా పెంచాలన్నారు.

స్వయం ఉపాధి పథకానికి

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల నూనెపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీ, క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ సబిహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద మైనార్టీలకు చెందినవారికి రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు, క్రైస్తవ మైనార్టీకి చెందినవారికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు 50శాతం సబ్సిడీ మంజూరు చేస్తామన్నారు. ఈ నెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 98485 64449, 94408 22219 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 84 వినతులు

నంద్యాల టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 84 వినతులను వచ్చినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరిస్తామని ఎస్పీ వెల్లడించారు.

గంగకు గ్రహణం..!



సీమలో కరువును పారదోలి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాటి ముఖ్యమంత్రి, దివంగత ఎన్‌టీ రామారావు అహర్నిశలు కృషిచేశారు. ఈనేపథ్యంలో తెలుగు గంగ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. మానసపుత్రికగా ఈ ప్రాజెక్టును భావించా రు. 1983లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, ఏపీ సీఎం నందమూరి తారకరామారావు, తమిళనాడు సీఎం ఎంజీఆర్ (మారుతూరు గోపాలన్ రామచంద్రన్) చేతుల మీదుగా తెలుగు గంగను ప్రారంభించారు. చెన్నై నగరానికి తాగునీరు, రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు శ్రీశైలం జలాశయం నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా అందించడమే లక్ష్యం. వారి పుణ్యమే తెలుగుగంగ ఆయకట్టు భూములు సస్యశ్యామలం అయ్యాయి. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ప్రాజెక్టుకు ప్రస్తుతం గ్రహణం పట్టుకుంది. ప్రధాన కాలువలు, తూములు, షట్టర్లు అన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. చివరి ఆయకట్టుకు నీరందక సాగు కష్టమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎన్టీఆర్ ఆశయం తెలుగు గంగ
- కూలిన ప్రధాన కాల్వ సైడ్‌వాల్స్
- శిథిలావస్థలో బ్లాక్‌ఛానళ్లు
- తుప్పుపట్టిన తూము షట్టర్లు
- 26, 27 బ్లాక్ ఛానళ్లలో ప్రారంభం కాని పనులు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు

రుద్రవరం, మే 12: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానస పుత్రిక తెలుగుగంగ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు ప్రస్తుతం గ్రహణం పట్టుకుంది. నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. తెలుగుగంగ ప్రధాన కాలువ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు(వీబీఆర్) నుంచి సుమారు 406 కిలోమీటర్ల నిర్మాణం చేపట్టి చెన్నై కాలువలకు అనుసంధానం చేశారు. నంద్యాల జిల్లాలో 96.14 కి.మీ పొడవునా గంగ ప్రధాన కాలువ విస్తరించి ఉంది. ఈ కాలువ నుంచి సాగునీరు అందించడమే లక్ష్యంగా ఉంది. కానీ తెలుగుగంగ ప్రధాన కాలువతో పాటు బ్లాక్‌ఛానళ్ల నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. నాయకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. నంద్యాల జిల్లాలో తెలుగుగంగ ప్రధాన కాలువ కింద ఆయకట్టు భూములు 1,14,500 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ జిల్లాలో 96.14 కి.మీ పొడవు ఉంది. మొత్తం 39 బ్లాక్‌ఛానళ్లు ఉన్నాయి. వీటిలో 1, 1ఆర్, 15ఎ, 15బి కాల్వలతో 39 బ్లాక్‌ఛానళ్లు ఉన్నాయి. కాలువల్లో ఎక్కడ చూసినా కల్వర్టుల వద్ద సిమెంటుతో నిర్మించిన దిమ్మెలు పగిలి శిథిలమై కాల్వల్లో పడిపోయాయి.



18వ బ్లాక్ ఛానల్‌లో కంపచెట్లు పూడిక దృశ్యం

చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి ఉప కాలువలకు నీరు విడిచేందుకు బ్లాక్‌ఛానళ్ల తూములు ఏర్పాటుచేశారు. బ్లాక్‌ఛానళ్ల తూముల గేట్లు తుప్పుపట్టిపోయాయి. ఇలాగైతే నీటి సరఫరా ఎలా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి కాలువ నిర్వహణ, గేట్ల మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. తెలుగుగంగ ప్రధానకాల్వలో భాగంగా బ్లాక్‌ఛానళ్ల నుంచి చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. రుద్రవరం మండలంలో చిలకలూరు, బి.నాగిరెడ్డిపల్లె, మందలూరు, చందలూరు, జంబులదిన్నె గ్రామాల రైతులకు సాగునీరు అందకపోవడంతో ఈ సారి పంటలు ఎండిపోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో సాగునీరందక పంటలు ఎండిపోయాయి. అలాగే 26, 27 బ్లాక్‌ఛానళ్ల పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. 2005లో పనులు ఆపివేశారు. ఇంతవరకు ఆ బ్లాక్‌ఛానళ్ల పనులే ప్రజాప్రతినిధులకు అధికారులకు పట్టలేదు.

కూలిన సైడ్‌వాల్

గంగ ప్రధాన కాలువలో భాగంగా బ్లాక్‌ఛానల్ సమీపంలో సైడ్‌వాల్ కూలిపోయింది. బసాపురం సమీపంలో సైడ్‌వాల్ దెబ్బతిన్నాయి.. శ్రీరంగాపురం సమీపంలోని గేట్ల వద్ద ప్రధాన కాలువలో చెత్తచెదారం ఒక సైడ్‌వాల్‌కు నిండిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు గంగ ప్రధాన కాలువను నిర్లక్ష్యం చేయడంతో రైతులకు సాగునీటి సరఫరా సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.



ప్రమాదకరంగా తెలుగుంగ ప్రధాన కాలువ 22వ బ్లాక్‌ఛానల్ తూము



ప్రధాన కాలువ సామర్థ్యం పెంచాలి

తెలుగుగంగ ప్రధాన కాలువ సామర్థ్యం పెంచాలి. సామర్థ్యం తక్కువగా ఉండటంతో సాగునీరు అందడం లేదు. తెలుగుంగ కాల్వలను చెరువులకు అనుసంధానం చేసి చెరువులు నింపాలి. అప్పుడే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

- వైఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు, రాయలసీమ సాగునీటి సాధన సమితి



ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి

వెలుగోడు రిజర్వాయరు ఇప్పటికీ కూడా పూర్తిసామర్థ్యంతో పనిచేయడం లేదు. వాటిని మరమ్మతులు చేయించి పూర్తి సామర్థ్యానికి తీసుకురావాలి. చివరి ఆయకట్టులో ఉన్న ప్రతి ఎకరాకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలి.

- బొజ్జ దశరథరామిరెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ సాగునీటి సాధన సమితి



రూ.10 కోట్లతో నివేదికలు పంపించాం

రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10 కోట్లతో నివేదికలు పంపించాం. ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, శ్రీశైలం. పాణ్యం నియోజకవర్గాల పరిధిలో ఉన్న తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్ కాలువల మరమ్మతులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే మరమ్మతులు చేస్తాం.

- శివ ప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఈ, తెలుగుగంగ ప్రాజెక్టు

పథకం ప్రకారమే హత్య?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- గడివేముల ఘటనలో రోజుకో ట్విస్ట్
- వివాహేతర సంబంధమే హత్యకు దారి?
- మద్యం తాపి..ఆపై పెట్రోల్ పోసి..
- చిన్న ఎముకలను విసిరేశారు
- పెద్ద ఎముకలను పొడిగా మార్చి..
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు
- పోలీసుల తీరుపైనా అనుమానాలు
- ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి వాస్తవాలు

నంద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మానవ అస్తిపంజరంలోని కొన్ని ఎముకలు, లభ్యమైన ఆనవాళ్లతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వరుస కథనాలతో ఓ కేసు మిస్టరీ వీడుతోంది. గత నాలుగు రోజులుగా 'పోలీస్.. ఇదేం తీరు..' 'మిస్టరీ వీడేనా..' కథనాలు పోలీస్ శాఖను కుదిపేసింది. ఈ కథనాలపై జిల్లా పోలీస్ బాస్ తమదైన శైలిలో స్పందించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ నేతృత్వంలో సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డిలు తదితర సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి రావడంతో ఈ కేసు మరింత ఉత్కంఠ రేపుతోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. పథకం ప్రకారమే హత్య జరిగినట్లు స్పష్టమైంది. అయితే హత్య అనంతరం విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్య చేసి గుర్తు పట్టకుండా శరీరంపై యాసిడ్, పెట్రోల్ పోసి దహనం చేశారు. ఆ తర్వాత మిగిలిన అస్తిపంజరంలోంచి చిన్న ఎముకలను విసిరేసి.. పెద్ద ఎముకలను పిండి చేసి అక్కడక్కడ పడేశారని సమాచారం. మొత్తంగా వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు తెలుస్తోంది.



రక్తపు మరకలతో ఉన్న దుస్తులు



పొలంలో నిప్పు పెట్టిన అనుమానిత స్థలం

పోలీసులు మొదట్లోనే కేసు నమోదు చేయకుండా జాప్యం చేయడం, ఆనవాళ్లను పోలీసులే మాయం చేసిశారంటూ స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్దిగా లభ్యమైన ఆనవాళ్లతో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడం హాట్ టాపిగా మారింది.

హత్యలో పక్కా స్కెచ్?

గడివేమల మండలానికి చెందిన ఓ గొర్రెల కాపరి కొన్నేళ్లుగా తాగుడికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో భార్య, పిల్లలు కూడా సదరు కాపరిని వదిలేశారు. దీంతో అక్కడక్కడ గొర్రెల కాపరిగా వెళ్తూ.. వచ్చే కూలీ డబ్బుతో వ్యసనాలు తీర్చుకునేవారు. ఆ గొర్రెల కాపరి గత నెల 23వ తేదీ నుంచి తన సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అయినట్లు గుర్తించారు. దీంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని నెలలుగా అదే మండలానికి చెందిన ఓ గొర్రెల యజమానికి వద్ద గొర్రెల కాపరిగా కూలీకి చేరాడు.

మిగతా 7వ పేజీలో

పొగాకు కొనుగోలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

నంద్యాల నూనెపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీలు ఒప్పందం చేసుకున్న విధంగా పొగాకును కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. నాణ్యమైన పొగాకు బేళ్లతో నిరసన చేపట్టారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 39వేల ఎకరాల్లో రైతులు పొగాకును పండించారన్నారు. ఒప్పందం చేసుకున్న పొగాకు కంపెనీలు పొగాకును కొనుగోలు చేయకుండా మోసం చేశాయని, దీంతో పండించిన పంటను ఏం చేయాలో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు సుమారు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టారన్నారు. ప్రస్తుతం పంటచేతికొచ్చాక ఇంట్లో పెట్టుకోవడానికి అవకాశం లేక, బయట కల్లాల్లో ఉంచితే వర్షం వల్ల నష్టపోయే ప్రమాదం ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. పెట్టుబడికోసం తెచ్చిన అప్పుదారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు పండించిన పంటకు క్వింటాలుకు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ రాజకుమారికి రైతు సంఘం నాయకులు, రైతులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మహానంది, రుద్రవరం, ఆళ్లగడ్డ, కొత్తపల్లె, పాణ్యం, గడివేముల, శిరివెళ్ల మండలాల రైతులు పాల్గొన్నారు.

మామిడీలా

- తగ్గుతున్న బంగినపల్లి మామిడి సాగు
- గిట్టుబాటు కాని ధరలు
- వాణిజ్య పంటలవైపు రైతులు మొగ్గు
- మామిడి చెట్లు కొట్టివేత
- మొక్కజొన్న, కంది, జొన్నలు సాగు
- కృత్రిమ పక్వంతో వ్యాపారుల మాయ


బంగినపల్లి మామిడి

బనగానపల్లె, మే 12: బంగినపల్లి మామిడి మన దేశంలోనే వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మన దేశంలో మామిడి పండ్ల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి మొదటి స్థానం కాగా రెండో స్థానం మనరాష్ట్రంలో సాగయ్యే బంగినపల్లి మామిడిదే. ఒక్కో పండు రెండు కిలోల వరకు తూగుతుంది. ఏ మాత్రం పీచు లేకుండా పూర్తిగా గుజ్జు మాత్రమే ఉండటం దీని ప్రత్యేకత. వీటికి ఉన్న డిమాండ్ ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇతర ప్రాంతాలనుంచి కాయలను దిగుమతి చేసుకుని బంగినపల్లి మామిడి పండ్లుగా విక్రయిస్తున్నారు. గతంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ సైతం ఇష్టపడి బంగినపల్లి మామిడిని తెప్పించుకొని తినేవారు. బంగినపల్లి మామిడి తోలు పలుచగా ఉండడం, ఎంతో మాధుర్యాన్ని కలిగి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 12,270 ఎకరాల్లో..

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 12,270 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. నంద్యాల జిల్లాలో 8396 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 3874 మామిడి సాగవుతోంది. వాతావరణంలో మార్పులు, వివిధ తెగుళ్ల మామిడికి వస్తుండడం, పూతరాలిపోవడం, గాలివానలకు మామిడి కాయలు కిందపడడం, తెగుళ్ల రావడం, మామిడి పిందెలు రాలడం వంటి కారణాలతో మామిడి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బనగానపల్లె మండలంలో కేవలం 160ఎకరాలకు పడిపోయింది. బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామాపురం గ్రామాల్లో మామిడి 248.588 ఎకరాల్లో సాగవుతోంది. డోన్ మండలంలో 1399.436 హెక్టార్లలో ప్యాపిలి మండలంలో 588.512 హెక్టార్లలో సాగవుతోంది. ఆళ్లగడ్డలో 102.872 హెక్టార్లు, పాణ్యంలో 160.228హెక్టార్లలో, రుద్రవరంలో 126.164హెక్టార్లలో సాగవుతోంది. మామిడి పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో బనగానపల్లె, ఇతర మండలాల్లోనూ మామిడి తోటలను తొలగించి వాణిజ్య పంటలవైపు రైతులు మళ్లారు. మామిడి చెట్లను కొట్టివేసి మొక్కజొన్న, కంది, జొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మామిడి రకాల్లో బంగినపల్లి ఒకటి. ఏటా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో వీటిని పండిస్తారు. బనగానపల్లె, యాగంటిపల్లె, జోళాపురం, పసుపల, ఇల్లూరుకొత్తపేట, భానుముక్కల తదితర ప్రాంతాల్లో దాదాపు 160 ఎకరాల్లో బంగినపల్లి మామిడిని పండిస్తున్నారు. బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామాపురం, ఆర్.ఎస్.రంగాపురం, బైనపల్లె, గ్రామాల్లో 630 ఎకరాల్లో బంగినపల్లి మామిడి పండ్లను పండిస్తారు. పంట సరిగా రాకపోవడంతో చెట్లను కొట్టివేసి ఇతర పంటలను పండించడంతో బంగినపల్లి మామిడి విస్తీర్ణం తగ్గిపోయింది.

5 నుంచి 6 టన్నుల వరకే..

హెక్టారు మామిడికి 10 టన్నులు పంట రావాల్సి ఉండగా 5 టన్నుల నుంచి 6 టన్నుల వరకే ఈఏడాది పంట దిగుబడి వచ్చింది. జనవరి నెలలో రావాల్సిన పూత వర్షాభావ పరిస్థితుల వల్ల ఫిబ్రవరి నెలాఖరులో మామిడి పూత వచ్చింది. దీనికి తోడు ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ఉన్న పూత దాదాపు రాలిపోయింది. అంతో ఇంతో నిలబడ్డ మామిడి గతనెలలో రెండు సార్లు భారీ ఈదురు గాలులు, వర్షాలు కురవడంతో మామిడి రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. పెట్టుబడులు భారీగా ఉండడంతో మామిడి రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.


బంగినపల్లి మామిడిని అమ్ముతున్న హోల్‌సేల్ వ్యాపారి


బంగినపల్లి మామిడి తోట

విషతుల్యంగా...

బంగినపల్లి మామిడి పండ్లకు గిరాకీ ఉండటంతో కొందరు వ్యాపారులు మాయ చేస్తున్నారు. కృత్రిమ పక్వంచేసి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నారు. పసుపు పచ్చ రంగులో అచ్చం మాగిన పండు లాగా కనిపించే ఈ కాయలు ఏమాత్రం రుచి లేక పోగా విష తుల్యంగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి పండ్లను తెప్పించుకుని బంగినపల్లి మామిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రుచి లేకపోవడం, వాటిని తిన్న తర్వాత కడుపులో మంట రావడం వల్ల డబ్బులు ఇచ్చి అనారోగ్యం తెచ్చుకుంటున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఒరిజినల్ బంగినపల్లె వంద మామిడి పండ్లను సైజను బట్టి రూ.6వేల నుంచి రూ.8 వేలకు వ్యాపారులు అమ్ముతున్నారు. చిరువ్యాపారులు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు మామిడిపండ్లను విక్రయిస్తున్నారు.


రసాయనిక మందులతో మాగబెట్టిన మామిడి పండ్లు

తగ్గిన దిగుబడి



ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గింది. ప్రకృతి వైపరీత్యాలు, అతి వృష్టి, అనావృష్టికి తోడు భారీగా గాలులు, వర్షం పడడంతో చెట్టు మీదనుంచి మామిడి కాయలు రాలిపోయాయి. సగం పంట కూడా ఈ ఏడాది రాలేదు.

\- హమీద్, కౌలు రైతు, బనగానపల్లె

రసాయనాలతో మాగిస్తున్నారు..



గతంలో మామిడి పండ్లను బాదం, వరి గడ్డితో మాగించేవారు. పండ్లకు మంచి వాసన, రుచి ఉండేది. ప్రస్తుతం వ్యాపారులు పండ్లను కార్బైడ్, ఇతర రసాయనాలతో మాగిస్తున్నారు. దీంతో బంగినపల్లి మామిడి రుచి తగ్గింది.

\- నరసింహుడు, రిటైర్డు ఉద్యోగి, బనగానపల్లె


తోటలో కాసిన మామిడి కాయలు

లోకేశ్‌ను విమర్శించే స్థాయి ఎస్వీకి లేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను విమర్శించే అర్హత, స్థాయి వైసీపీ నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం ఇష్టం వచ్చినట్లు ప్రజలను, చట్టాన్ని ధిక్కరించి ప్రవర్తించారన్నారు. అలాంటి వారి వివరాలు మాత్రమే రెడ్‌బుక్‌లో ఉంటాయన్నారు. అంతమాత్రాన రెడ్‌బుక్ అంటూ గగ్గోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రెడ్‌బుక్ అంటే మీకెందుకంత భయమన్నారు. తప్పు చేసిన వారి విషయంలో చట్టం తనపని తాను చేసుకుంటుందన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులకు తావు లేదన్నారు. మంత్రి హోదాలో పని చేసిన విడుదల రజనీ అధికారులతో ఎలా మసులుకోవాలో తెలియదా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. హెచ్ఎన్ఎస్, ఎల్ఎల్‌సీ పనులకు నిధులు కేటాయించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలా ప్రజలను తాము ఇబ్బందులకు గురి చేయడం లేదన్నారు. నారా లోకేశ్‌పై అవసవసరమైన వాఖ్యలు చేయడం మానుకోవాలని వైసీపీ శ్రేణులకు తిక్కారెడ్డి హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ముత్యాల తిరుపాల్, సత్రం రామకృష్ణుడు, చంద్రకాంత్, ధరూర్ జేమ్స్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డుకు సీఎం హామీ

- ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డు విస్తరణకు కూడా..
- నేషనల్ హైవే కింద చేపట్టేలా చర్యలు
- మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్‌పై విజ్ఞప్తి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు

వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు దశాబ్దాల స్వప్నం. 2024 ఎన్నికల సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు సహా ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారిని జాతీయ రహదారి కింద చేర్చి ఆధునీకరణ చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు ప్రధాన రోడ్ల నిర్మాణం చేస్తే ఎమ్మిగనూరు పట్టణం వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అదే క్రమంలో బనవాసి జెర్సీ పశుక్షేత్రం కేంద్రంగా 79 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి ఈ నెల 1న సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. టెక్స్‌టైల్ రంగంలోని పరిశ్రమలు ఇక్కడికి రావాలంటే కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయానికి చేరుకోవడానికి వీలుగా రోడ్డు, రైల్వే రవాణా అత్యంత కీలకం. ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారి, మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు 110 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సోమవారం సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం ఇచ్చారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం ఆవశ్యకత, రెండు దశాబ్దాల స్వప్నమైన మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి, జౌళి రంగ పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావడానికి అనువుగా రవాణా సౌకర్యం ఎంతో ముఖ్యమని చంద్రబాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు ఓఆర్ఆర్, ఎమ్మిగనూరు-కోడుమూరు మధ్య రోడ్డును జాతీయ రహదారుల కింద చేర్చి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టేలా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు 110 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాస్తానని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బీవీ తెలిపారు.

సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు

ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు, ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రోడ్డును జాతీయ రహదారుల కింద చేర్చి అభివృద్ధి చేయాలని, ఎన్నో దశాబ్దాలుగా పశ్చిమ ప్రాంత ప్రజలు స్వప్నంగా ఉన్న మంత్రాలయం-కర్నూలు రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇచ్చాను. ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎంవో నుంచి కేంద్రానికి లేఖ వెళ్లగానే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను ఒప్పించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తాను. ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే పట్టణం వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

\- బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

బాలల్లో దేశభక్తిని ప్రేరేపించండి

'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్'లో వక్తలు


భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



కర్నూలు కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బాలల్లో దేశభక్తిని ప్రేరేపించే బాధ్యత తల్లిదండ్రులదేనని పలువురు మహిళా వక్తలు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్' మూడో రోజు సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఆసాంతం ఆకట్టుకున్నాయి. దేశభక్తిని చాటిచెబుతూ వివిధ మహిళా సంఘాలు, సంస్థల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణురాలు జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆచరించే మాటలకే విలువ ఎక్కువ అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో తమవంతు ధర్మాన్ని పాటించినప్పుడే సమాజ వికాసం సాధ్యమన్నారు. దేశంలో ఉగ్రవాదుల్ని ప్రవేశించకుండా ప్రతి పౌరులూ బాధ్యతగా ఉండి ఉంటే ఇంతటి ఆకృత్యాలు జరిగేవి కాదని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ దేశభక్తి అనేది సైనికులకు మాత్రమే కాదని, అది ప్రజలందరిలో ఉండాలని, జాతిని బలోపేతం చేయగలశక్తి మహిళలకు ఉందని అన్నారు. ఇటీవల వింగ్ కమాండర్లు వ్యోమిక సింగ్, సోఫియా ఖురేషి నిర్వహించిన పాత్ర మహిళాశక్తికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ నగరూరు శమంతకమణి, రాష్ట్ర సేవికా సంస్థ జిల్లా అధ్యక్షురాలు విశాలాక్షి, విశ్రాంత అధ్యాపకురాలు విజయలక్ష్మి, డాక్టర్ జయలక్ష్మి, సంగీత విద్వాంసురాలు సరస్వతమ్మ, కవయిత్రి కల్యాణదుర్గం స్వర్ణలత, రచయిత్రులు ఆరేపల్లి వరలక్ష్మమ్మ, సునీత, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని తదితరులు ప్రసంగించారు.

అలరించిన దేశభక్తి గీతాలు: సమాజా భివృద్ధిలో, దేశ రక్షణలో మహిళల పాత్రను వివరిస్తూ గాయకులు, నృత్య కళాకారులు ప్రదర్శించిన పలు అంశాలు ఆకట్టుకున్నాయి. గాయని సుజాత, కరీముల్లా శిష్యబృందం నృత్య ప్రదర్శన, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మూడోరోజు సోమవారం కేవలం మహిళా శక్తిని చాటిచెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా మంగళవారం సాయంత్రం జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.


జ్యోతిప్రజ్వలనతో జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న మహిళలు

వైభవం.. కోసిగయ్య రథోత్సవం

- జనసంద్రమైన కోసిగి
- మొక్కులు తీర్చుకున్న నూతన దంపతులు


రథోత్సవంలో సందడి చేస్తున్న కొత్తగా పెళ్లయిన దంపతులు

కోసిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల దైవం కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) మహారథోత్సవం సోమవారం వైభవంగా సాగింది. సాయంత్రం కోసిగిలోని తేరుబజారు మైదానంలో జరిగిన రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కోసిగయ్య స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారిని రథంపై కొలువుదీర్చారు. స్వామివారి నామస్మరణ నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంలో నూతన దంపతులు రథంపై ఉన్న కలశాన్ని దర్శించుకోవడం ఇక్కడి ఆనవాయితీ. అందుకే కొత్తగా వివాహాలు చేసుకున్న దంపతులు స్వామివారి రథోత్సవ కలశాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. సాయంత్రం జరిగిన రథోత్సవంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో సాయికుమార్, ఆలయ అర్చకులు శ్రీరాములు, విష్ణుచిత్తు, దుర్గాప్రసాద్, ధర్మకర్తలు శ్రీనివాసులు దొర, మురళీదొర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, తాయన్న, అయ్యన్న, భరత్ శెట్టి, చింతలగేని నర్సారెడ్డి, వెంకటేశ్, ఈరన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.

అశేష భక్తజనవాహిని నడుమ కోసిగయ్య స్వామి రథోత్సవం



అలంకరణలో కోసిగయ్య స్వామి






రథోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి



ఎర్రా ఎర్రని సూరీడు అందరి నేస్తం.. పంటలకు ప్రాణమిచ్చే సూరీడు జీవకోటికి ప్రాణాధారం.. వేసవిలో మండుటెండలతో భయపెట్టే సూరీడు కూడా ఎందుకో భయపడినట్లున్నాడు. అందుకే ఇలా చెట్టు చాటున దాగిపోయాడు. సోమవారం కర్నూలు జగన్నాథ గుట్టపై సూర్యాస్తమయాన ఓ ఈత చెట్టు వెనుక వైపు సూర్యుడు ఇలా సుందరంగా కనిపించాడు.

- కర్నూలు(ఆంధ్రజ్యోతి)
ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ఇటీవలి కాలంలో యువత బైక్‌పై విన్యాసాలు చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు చేతులు వదిలేసి బైక్‌లు నడపడం, బైక్‌లపై నిల్చుని ప్రయాణిస్తూ ఒళ్ల గగుర్పొడిచేలా విన్యాసాలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు, వ్యూస్, ఫేమ్ కావడం కోసం యువత ఇలాంటి విన్యాసాలు చేస్తోంది. సోమవారం కర్నూలు నగర శివారులోని నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిపై యువకులు ఇలా బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ కనిపించారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

పథకం ప్రకారమే హత్య?



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న పోలీసులు

(5వ పేజీ తరువాయి)

అయితే సదరు యజమానికి చెందిన బంధువుల్లో ఇద్దరు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సదరు గొర్రెల కాపరికి, యజమాని కుటుంబ సభ్యులతో పాటు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులతో వివాదం మొదలైంది. గొర్రెల కాపరి చేసిన పనికి కుటుంబ పరువు బజారున పడుతుందని ఆ కాపరిపై కక్ష పెంచుకున్నట్లు సమాచారం. యజమాని కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారా..? లేక వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులు సదరు కాపరిపై కక్ష పెట్టుకున్నారా...? అన్న విషయంలో మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఏప్రిల్ 23వ తేదీన గడివేముల మండల పరిధిలో సదరు గొర్రెల కాపరితో పాటు మరోక వ్యక్తి కూడా మద్యం కొనుగోలు చేసినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డయినట్లు సమాచారం. మొత్తంగా గొర్రెల కాపరిని పథకం ప్రకారమే హత్య చేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

మద్యం తాపి ఆపై...

పథకం ప్రకారమే గొర్రెల కాపరిపై కక్ష పెంచుకున్న రెండు వర్గాలు సైతం (వీరిలో ఏ వర్గం ఈ దాడికి పాల్పడిందో) సదరు కాపరిని అంత మొందించడానికి వ్యూహాత్మకంగా పథకం వేసినట్లు తెలుస్తోంది. సదరు కాపరికి మద్యానికి బానిసగా ఉండటంతో సదరు నిందితులకు మరింత కలిసి వచ్చినట్లైంది. గత నెల 23న పథకంలో భాగంగా మద్యం షాపునకు పంపారు. ఆ తర్వాత అక్కడి నుంచి కాపరిని మాయమాటలతో నమ్మించి.. ఈనెల 9వ తేదిన గడివేముల మండల శివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. నిందితులు మాటువేసి మద్యం సేవించిన తరువాత కాపరిని రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. అనుమానం రాకుండా మృతదేహంపై పెట్రోల్ లేదా యాసిడ్ పోసి నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది. తర్వాత ఆనవాళ్లు గుర్తు పట్టకుండా పెద్ద ఎముకలను పొడి చేసి అక్కడక్కడ పడేశారని తెలిసింది. మిగిలిన కొన్ని ఎముకలను సైతం వేర్వేరుగా విసిరేసినట్లు సమాచారం. ఇదంతా చూస్తుంటే ఎంతో కర్కశంగా సదరు కాపిరిని హత్య చేశారనే విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు నిందితులను డీఎస్పీ నేతృత్వంలో సీఐ, ఇద్దరు ఎస్ఐలు తదితర సిబ్బంది కలిసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో ఒక్కొక్కరిగా విచారణ చేయగా.. పలు ఆసక్తి విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో పోలీసుల్లోను ఉత్కంఠ రేపుతోందని తెలిసింది.

కొందరు పోలీసులపై ఆరోపణలు

ఈ ఘటన విషయంలో లోతుగా పరిశీలిస్తే కొందరు పోలీసులపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ రైతు తన పొలంలో గత నెల 28వ తేదిన జొన్న పంటను తొలగిస్తుండగా.. అస్థి పంజరం ఆనవాళ్లు బయటపడ్డాయని గడివేముల పోలీసులకు సమాచారం అందించాడు. ఆ తర్వాత పోలీసులు సైతం సంఘటన స్థలానికి స్పష్టత లేని ఆనవాళ్లు ఉన్నాయని గ్రహించారో..? లేక గుర్తు తెలియని శవం కదా...? భవిష్యత్‌లో మనకెందుకు సమస్య అని వదిలేశారో..? కానీ స్పాట్‌కు వెళ్లి కూడా ఆ రోజున పోలీసులు కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ఆ తర్వాత ఆనవాళ్లు సైతం బూడిద కావడంతో పోలీసులే ఈ పని చేయించారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతటితో ఆగకుండా సదరు ఆనవాళ్ల ఫొటోలు తీసిన రైతుతో కూలీలు (ఇతర వ్యక్తులు) సెల్‌ఫోన్లు తీసుకుని పోలీసులు డిలీట్ చేయించడం అనుమానాలకు తావిస్తోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసుల్లో ఒకింత ఆందోళన కలిగిస్తోంది. మొత్తం మీద నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఆర్టీసీ బస్సులో చోరీ

- 4 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆదోని నుంచి కర్నూలుకి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సోమవారం సాయంత్రం చోరీ జరిగింది. వివరాల మేరకు.. పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న స్వప్న నంద్యాలకు వెళ్లేందుకు ఆదోని ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలుకి వెళ్తున్న బస్సును ఎక్కింది. ముందుగా సీటు పట్టుకునేందుకు బస్సు ఎక్కి తన హ్యాండ్ బ్యాగ్‌ను సీట్లో ఉంచి, పక్కన ఉన్న మరో ప్రయాణికురాలికి చూస్తుండమని చెప్పి లగేజీ తీసుకురావడానికి వెళ్లింది. అయితే తిరిగి వచ్చి చూడగా తర్వాత హ్యాండ్ బ్యాగ్ జిప్పు ఓపెన్ చేసి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా, అందులోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే విషయాన్ని కండక్టర్, డ్రైవర్‌కు చెప్పడంతో బస్సు నిలిపేసి ప్రయాణికులను విచారించారు. ఎంతకీ లభ్యం కాకపోవడంతో బాధితురాలు స్వప్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని, సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

హాలహర్వి తహసీల్దార్‌పై వేటు

- సరెండర్ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు
- డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మికి ఇన్‌చార్జిగా బాధ్యతలు



ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మి

హాలహర్వి, మే 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ నజీమాబానుపై వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్యం, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాకపోవడం, రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాకపోవడం తదితర ఫిర్యాదులు రావడంతో ఆమెను సరెండర్ చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆర్డీవోను ఆదేశించారు. మండల ప్రజలు రెవెన్యూ సమస్యలతో కోర్టులు, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఫిర్యాదులు వెల్లడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఆమెను విధుల నుంచి తప్పించి డీటీ లక్ష్మిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

మద్యం స్వాధీనం

శిరివెళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన యోగానంద్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. అతడి వద్ద నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

రమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

మిడుతూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మిడుతూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులుజేసి ఆలయం నుంచి పూలతో అలంకరించిన రథం వరకు తీసుకొనివచ్చి ప్రదక్షిణలు చేశారు. దేవదాయశాఖ అధికారులు, భక్తులు రథం చుట్టూ ప్రదక్షిణలు చేసి టెంకాయలు సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి ఉత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు ఆవరణ వరకు ఈ రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డికి ఏవో వెంకట రమణ ఆధ్వర్యంలో పురోహితులు, ఆలయ చైర్మన్ భూమ కృష్ణమోహన్ రావు వారికి పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి చెన్నకేశవ స్వామికి పూజలు చేశారు.



జలాశయాన్ని పరిశీలిస్తున్న సీడీవో బృందం

శ్రీశైలం డ్యామ్ పరిశీలన

శ్రీశైలం, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ కమిటీ బృందం సోమవారం శ్రీశైలం జలాశయాన్ని పరిశీలించింది. శ్రీశైలం జలాశయానికి ప్లాంజ్ పుల్ గుంత ఏర్పడిన కారణంగా డ్యామ్ భద్రత చర్యలు తీసుకునేందుకు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించిన అంశాలలో డిజైనింగ్ లోపాలను పరిశీలించేందుకు వచ్చినట్లు సీడీవో ఎస్‌ఈ శివప్రసాద్ తెలిపారు. పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీశైలం డ్యామ్‌కు ఎటువంటి ప్రమాదం లేదని, ప్రస్తుతం జలాశయం బేస్‌మెంట్ గట్టిగా ఉందని చెప్పారు. 1986 నుంచి డ్యాం బేస్‌మేంట్ సేఫ్టీ కొరకు ఏర్పాటు చేసిన సేఫ్టీ సిలిండర్లలో 12 సిలిండర్లు పాడైపోయాయని తెలిపారు. వాటికి సంబంధించిన మరమ్మతుల చర్యల నిమిత్తం శ్రీశైలానికి వచ్చినట్లు తెలిపారు. ఈ పనులను పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా ప్లాంజ్ పుల్ గుంతకు మరమ్మతులు జరపాలని, డ్యామ్ సేఫ్టీ సిలిండర్ల వరకు పర్యవేక్షణ రోడ్డును ఏర్పాటు చేసేందుకు జలవనరులశాఖ అధికారులకు సెంట్రల్ డిజైనింగ్ కమిటీ ప్లాను అందజేయనున్నట్లు ఎస్‌ఈ తెలిపారు.

పెళ్లింట విషాదం

- తలంబ్రాల మరుసటి రోజే పెళ్లికూతురి తల్లి ఆత్మహత్య



దేవి (ఫైల్)

నంద్యాల టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిన్నకూతురు పెళ్లి కార్యక్రమాలు ముగియక ముందే తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో పెళ్లింట విషాదం నెలకొంది. ఈ ఘటన పట్టణంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలివీ.. పట్టణంలోని నూనెపల్లెకు చెందిన దేవి (45) కూతురు వివాహం ఈనెల 11న ఘనంగా జరిపించారు. అయితే తలంబ్రాల మరుసటి రోజు సోమవారం తెల్లవారుజామున దేవి చిన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారుజామున 3 గంటల తర్వాత దేవి ఇంటి నుంచి వెళ్లింది. అయితే పశువుల వద్దకు వెళ్లి ఉంటుందని అనుకున్నారు. ఉదయం మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. దేవి చిన్న కూతురును శిరివెళ్ల మండలం బోయిలకుంట్ల గ్రామానికి ఇచ్చి వివాహం చేశారు. దేవికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, భర్త నాగేశ్ ఉన్నారు. అనారోగ్యంతో దేవి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

సీహెచ్‌వోల మానవహారం



రాజ్‌విహార్‌లో మానవహారం చేస్తున్న సీహెచ్‌వోలు

కర్నూలు హస్పిటల్, మే 12 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె ఉధృతమైంది. సోమవారం ఉదయం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నుంచి రాజ్‌విహార్ వరకు సీహెచ్‌వోలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం రాజ్‌విహార్‌లో మానవహారం నిర్వహించారు. మానవహారం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అనంతరం సీహెచ్‌వోలు ర్యాలీగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చందన, వైస్ ప్రెసిడెంటు నాగరాజు, కోశాధికారి కార్తిక్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలన్నారు.

ఏఐటీయూసీ మద్దతు..

సీహెచ్‌వోల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

రైల్వేగేట్‌ను ఢీకొన్న కారు

- గాజులపల్లి స్టేషన్‌లో అరగంట పాటు నిలిచిన తిరుపతి-గుంటూరు రైలు
- నాలుగు గంటలపాటు వాహన రాకపోకలకు అంతరాయం
- డ్రైవర్‌పై కేసు



రైల్వే గేట్‌ను ఢీకొని దెబ్బతిన్న కారు

మహానంది, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన రైల్వే గేట్‌ను సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఓ కారు ఢీకొట్టింది. పైగా ఆ కారు రైల్వే ట్రాక్‌పై ఆగిపో యింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే రైలుకు అంతరాయం ఏర్పడింది. తిరుపతి నుంచి గుంటూరుకు వెళ్లే రైలు నంద్యాల స్టేషన్ దాటిన తర్వాత గాజులపల్లి వద్ద సిబ్బంది గేట్ వేశారు. అయితే కర్నూలు నుంచి వెళ్తున్న కారు గేట్‌ను ఢీకొట్టి రైల్వే ట్రాక్‌పై ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది తిరుపతి-గుంటూరు రైలు గాజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆగేలా చర్యలు తీసుకున్నారు. చివరికి రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ఉన్న కారును పక్కకు తొలగించి రైలు యథావిధిగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అయితే అర్ధగంట రైలు అరగంట ఆలస్యంగా వెళ్లింది. రైలు గేట్లు దెబ్బతినడంతో లాక్ ఓపెన్ కాలేదు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలాన్ని నంద్యాల రైల్వే పోలీసులు పరిశీలించారు. మరమ్మతుల అనంతరం ఉదయం 7గంటలకు వాహనాలు బయలుదేరాయి. నాలుగు గంటల పాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కారు డ్రైవర్ విష్ణువర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదానికి గల కారణాలను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి



పవన్ (ఫైల్)

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం బస్టాండు ఎదురుగా ఆటోలో ఉన్న పైపులను దించబోయి ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం సాయంత్రం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. నందవరం మండలం నది కైరవాడి గ్రామానికి చెందిన ఆటోలో ఎమ్మిగనూరులో 8 క్వింటాళ్ల పైపులను ఆటోపై వేసుకుని మంత్రాలయం వచ్చారు. మంత్రాలయంలో అన్‌లోడింగ్ చేస్తుండగా.. నది కైరవాడికి చెందిన పవన్ (30) పైపులు ఆటో మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆటో కింద పడుతుందని ఆపేందుకు వెళ్లిన పవన్ ప్రమాదవశాత్తు ఆటో, పైనున్న పైపులు మీద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

వెలుగోడు, మే 12(ఆంధ్రజ్యోతి): వెలుగోడు, అబ్దుల్లాపురం మధ్య వెళ్తున్న ఆటోపై నుంచి పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలివీ.. రేగడగూడూరు గ్రామానికి చెందిన వంశీ (20) స్వగ్రామం నుంచి ఆటోలో వెనుకవైపు నిలబడి ప్రయాణిస్తున్నాడు. ఆటో అబ్దుల్లాపురం గ్రామ సమీపంలో మలుపు తిరుగుతుండగా ఆ యువకుడు అదుపుదప్పి ఆటో నుంచి కిందపడ్డాడు. దీంతో ఆ యువకుడి తల పగిలి తీవ్రంగా రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వంశీ తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షాషావలి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బేతంచెర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన యాపమాను రాజు (55) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన రాజు మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాజు ఈనెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 12న ఉదయం మృతి చెందాడు. రాజు కుమారుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

శిరివెళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం మహిళను వేధిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య సోమవారం తెలిపారు. వివరాలివీ.. గోవిందపల్లె గ్రామానికి చెందిన గడ్డం కవిత అనే మహిళను ఆత్మకూరుకు చెందిన మధుసూదన్‌కు ఇచ్చి పెద్దలు కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించారు. కొద్ది కాలంగా భర్త, అత్తా మామతో పాటు కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకొని రావాలని వేధిస్తున్నారు. దీంతో కవిత పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త మధుసూదన్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీరజవాన్‌కు నివాళి



వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, అధికారులు

జూపాడుబంగ్లా, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో అనంతపురం జిల్లాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆతని మరణం భారతదేహానికే తీరనిలోటని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అతని మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూ ఎస్ఏఈ నాగేంద్ర, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి ఎనలేని సేవచేసిన పల్లా శ్రీనివాసరావు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు పార్టీకి ఎనలేని సేవచేసి ఈ ఏడాది కోటిమంది సభ్యత్వాలు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లా టీడీపీ పార్టీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకుని కేకు కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పి.లింగాపురం గ్రామంలో ఎమ్మెల్యే పాల్గొని కృష్ణయ్య కుటుంబానికి మంజూరైన సీఎం ఆర్ఎఫ్ రూ. 1.40లక్షల చెక్కును అందజేశారు. అదే గ్రామానికి చెందిన నారాయణ అనే రైతుకు రాయితీకింద మంజూరైన రొటవేటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, కేసీకాల్వ నీటిసంఘం చైర్మన్ పరమేశ్వరరెడ్డి, మండల టీడీపీ నాయకులు మాండ్రసురేంద్రనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి,నారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవికాంత్, రవికుమార్‌యాదవ్, సుధాకర్, పెద్దన్న, బాలమద్దిలేటి, రాముడు, గోరేసాహెబ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బుద్ధుడి అడుగుజాడలు.. మానవాళికి వెలుగుజాడలు

● నంద్యాలలో ఘనంగా బుద్ధ జయంతి

నంద్యాల కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): బుద్ధుడు బోధించిన అష్టాంగమార్గం విశ్వానికి వెలుగు వంటిందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాల్ పక్కన గల తెలుగుతల్లి ఉద్యానవనంలో బుద్ధపూర్ణిమ కార్యక్రమాన్ని ఐడీఏ ఆధ్వర్యంలో బుద్ధుడి విగ్రహానికి పూల మాలార్పణ చేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలోఈ డాక్టర్ గెలివి సహదేవుడు, ఎంఈఓలు రామసుబ్బయ్య, మనోహర్ రెడ్డి, వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు అన్నెం శ్రీనివాస రెడ్డి, అవ్వారి శేషఫణి, డా. నీలం వెంకటేశ్వర్లు, కవులు మాబుబాషా, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నంద్యాల నూనెపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు మండలం పైపాలెం నుంచి కలమందలపాడువరకు చెందిన ఏపీఐఐసీ భూములను పారిశ్రామికవాడగా గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిడుతూరు మండలంలోని 3500ఎకరాల భూములు ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న వాటిని భారత్ సిందూర్ పేరుతో ఎంఎస్ఎంఈ పథకం కింద పారిశ్రామికవాడగా నామకరణం చేయాలని, ఆ భూములను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా గ్రూపులకు, నిరుద్యోగ యువతీ, యువకులకు ఎంపవర్‌మెంట్ కింద వృత్తి నైపుణ్యాలతో శిక్షణ ఇచ్చి అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కలమందలపాడు చెరువుకు హంద్రీ-నీవా, సుజల-స్రవంతి కాలువ ద్వారా నింపాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో 'పది' మార్కుల మెమోరాండం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా మార్కుల మెమోరాండం వెబ్‌సైట్‌లో అందుబాటులో అందుబాటులో ఉందని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్‌లోకి వెళ్లి సంక్షిప్త మార్కుల జాబితా నుంచి సబ్జెక్టు వారీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, సంతకం చేసిన కాపీలను సంబంధిత పాఠశాలకు చెందిన విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 42 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 2.30గంటల నుంచి 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. సోమవారం మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్ష జరిగింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 2650 మందికి గాను 2530 మంది విద్యార్థులు హాజరు కాగా 120మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు.

● ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 443 మంది విద్యార్థులకు గాను 419 మంది విద్యార్థులు హాజరుకాగా 24మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో తెలిపారు.

సందేహాలను నివృత్తి చేయండి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలలో, పదోన్నతులలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. నంద్యాలలో ఏపీటీఎఫ్ నాయకులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ ఒకే గ్రామంలోని పాఠశాలలను విలీనం చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని, విలీనం చేయడం వల్ల సర్‌ప్లస్ అయిన ఉపాధ్యాయులను కూడా మోడల్ పాఠశాలలోనే విధులు కేటాయించాలని కోరుతున్నామన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలకు కేటాయించిన పీఎస్‌హెచ్ఎం పోస్టులను ఏ విధంగా భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జాకీర్‌హుశ్శేన్, ఇద్రూస్‌బాషా, వెంకట్రామిరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

పాణ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో 19 నుంచి 21 వతేదీ వరకు జరిగే కుంభాభిషేకం, కలశ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే గౌరు చరితను ఆలయ ఈవో రామకృష్ణ, సిబ్బంది ఆహ్వానించారు. సోమవారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే భక్తుల సహకారంతో దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన మహాప్రాకారాన్ని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు సురేష్ శర్మ, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భద్రత కరువు!

● తెలుగు గంగ టైం స్కేం ఉద్యోగుల వేదన
● కూలీ బాటలో విద్యాకుసుమాలు
● టీడీపీ హయాంలో న్యాయం
● వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

నంద్యాల మున్సిపాలిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో టైంస్కేల్ ఉద్యోగుల జీవితాలు దయనీయంగా మారాయి. జిల్లాలోని తెలుగు గంగ ప్రాజెక్టుతో పాటు పలు ఇతర శాఖల్లో 200పైగా టైం స్కేల్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకపోవడం, జీతాలు తక్కువ ఉండడం, అవి కూడా సరైన సమయానికి రాకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం పర్మినెంట్ చేయకపోవడం వల్ల రిటైర్డ్ అయ్యాక కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. కొందరు పిల్లలను చదివించుకోలేక కూలీ పనులను పంపిస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని అనేక సార్లు కోరినా పట్టించుకోవడం లేదని టైం స్కేల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసింది

మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో వైద్య ఆరోగ్య శాఖలో టైం స్కేల్ ఉద్యోగుల కంటే జూనియర్లు అయిన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. 2014-19లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు వీరికి పదవీ విరమణ వయసును 58నుంచి 60కి పెంచారు. 2019 తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి వీరిని నిర్లక్ష్యం చేసి టైం స్కేల్ ఉద్యోగులు జీవితాల్లో తీరని వేదన మిగిల్చింది.



తెలుగు గంగ కార్యాలయం

జీతాలు తక్కువ.. ఇబ్బందులు ఎక్కువ

టైం స్కేల్ ఉద్యోగులకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జీతాలు లేకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సదరు ఉద్యోగులు సంతానానికి నాణ్యమైన చదువులు చదివించాలన్నా, రోగాలతో బాధపడే తమ వారికి చికిత్స చేయించాలన్న నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తమ మీద దయ చూపి తమ జీతాలను పెంచి కుటుంబాలను కాపాడాలని టైం స్కేల్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అమ్మానాన్న లేని అనాథలం



నేను వెలుగోడులో ఇంటర్ చదువుకుంటున్నా. మా నాన్న తలారి వెంకటేశ్వర్లు తెలుగు గంగ ప్రాజెక్టులో 32 సంవత్సరాలు టైంస్కేల్ ఉద్యోగిగా పని చేసి మరణించారు. మా అమ్మ నాన్న కంటే ముందే మరణించింది. నాకు చెల్లి, తమ్ముడు ఉన్నారు. అమ్మా నాన్న చనిపోవటంతో అనాథలమైన మమ్మల్ని అవ్వ తాతలు చేరదీశారు. అవ్వా తాతలకు భారం కాకూడనే ఉద్దేశ్యంతో నేను చదువుకుంటూనే కూలీ పనిచేస్తున్నా. నా ఆర్థిక ఇబ్బందులు చూసి వెలుగోడులోని డి.పాల్ కళాశాల యాజమాన్యం నాకు ఉచిత విద్యను అందిస్తోంది. తమ్ముడు చెల్లి కస్తూర్బా పాఠశాలలో చదువుతున్నారు. కారుణ్య నియామకం కింద నాకు ఉద్యోగం ఇస్తే వృద్ధులైన అవ్వా తాతలతో పాటు నా చెల్లి తమ్ముడ్ని పోషించుకుంటాను.

- తలారి సుప్రియ ఇంటర్ విద్యార్థిని

ఆదుకోండి



మా నాన్న శ్రీనివాసులు తెలుగు గంగ ప్రాజెక్టులో 32 సంవత్సరాలు టైం స్కేల్ ఉద్యోగిగా పనిచేసి గుండెపోటుతో మరణించారు. నాకు ఇద్దరు అక్కలు ఉన్నారు. డిగ్రీ చదువుతున్న నేను విధిలేని పరిస్థితులో మా అమ్మతో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నాన్న చనిపోయాక మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం దొరకలేదు. నాన్న మృతితో మా పరిస్థితి దయనీయంగా మారింది. కన్నీటితో వేడుకుంటున్నా ప్రభుత్వం స్పందించి తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి.

వెంకటేష్, మహదేవపురం గాజులపల్లె



క్రమబద్ధీకరించాలి



నేను గత 30సంవత్సరాలుగా నంద్యాల తెలుగు గంగ ప్రాజెక్ట్‌లో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నా. ప్రభుత్వం మమ్మల్ని పర్మినెంట్ చేయలేదు. మా పదవీ విరమణ వయసు పెంచలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది టైం స్కేల్ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం మా బాధలను సానుభూతితో పరిశీలించాలి. అందరినీ పర్మినెంట్ చేయడంతో పాటు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి ఆర్థిక భద్రత ఇచ్చి మా కుటుంబాలను కాపాడాలి.

- సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు, టైం స్కేల్ ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త కార్యాచరణ కమిటీ

సిద్ధాపురం చెరువు పరిశీలన

ఆత్మకూరు, మే 12(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం చెరువును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్‌డీఆర్ఎఫ్ నిధులతో చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టడంతో పాటు మట్టికట్ట పటిష్ఠతకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎడమ ప్రధాన కాల్వలో పూడికతీత పనులతో పాటు కాల్వ వెంట రహదారి పనులను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆయకట్టు స్థిరీకరణకు పాటుపడుతానని అన్నారు. ఈయన వెంట టీడీపీ నాయకులు వై.యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సిద్ధాపురం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

మలన్న సేవలో ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న స్థానిక ఎమ్మెల్యేకు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిధులు కేటాయించండి

● మంత్రి నారాయణను కోరిన ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి కోరారు. సోమవారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో మంత్రి నారాయణను నంద్యాల ఎంపీ, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ డి.సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఉన్న పలు సమస్యలపై చర్చించారు. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన నందికొట్కూరు మున్సిపాలిటీలో నిధుల కొరతతో అభివృద్ధి కుంటు పడిందని మంత్రికు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని మంత్రి నారాయణ ఎంపీకి హామీ ఇచ్చారు.



మంత్రిని కలిసిన ఎంపీ

చలో సిద్ధేశ్వరం సభను విజయవంతం చేయండి

నంద్యాల మున్సిపాలిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): 31న చేపట్టనున్న చలో సిద్ధేశ్వరం ప్రజా బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి సోమవారం పిలుపు నిచ్చింది. సమితి నాయకులు చాబోలు, మునగాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, పోలూరు, పాండురంగాపురం గ్రామాల్లో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నంద్యాల బాలాజి కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, జానో జాగో కన్వీనర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వ్యాపారులకు అవగాహన సదస్సు

నంద్యాల కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు వస్తువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లీగల్‌మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జిలానీ భాషా, ఇన్‌స్పెక్టర్ అనిత పేర్కొన్నారు. నంద్యాలలోని నూనెపల్లెలోని నర్స్ క్వార్టర్స్‌లోని సత్య సమీక్ష కేంద్రంలో సోమవారం వ్యాపారస్తులకు లీగల్‌మెట్రాలజీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిలానీ భాషా మాట్లాడుతూ గ్యాస్‌సిలిండర్ కొనేటప్పుడు ఎంఆర్‌పీ ధర మాత్రమే చెల్లించాలన్నారు. పెట్రోల్‌బంక్‌లో పెట్రోలు పట్టించుకునేటప్పుడు జీరో చూసి పెట్రోల్ పట్టించుకోవాలన్నారు. అట్లా లేనిఎడల కంప్లైంట్ నెంబర్ 1967పోన్ చేయాలని సూచించారు. సదస్సులో రిటైల్ మర్చంట్స్ అసోషియేషన్ ప్రసిడెంట్ గుబ్బా రజనీకాంత్, సెక్రటరీ కిరణ్, రమణయ్య, సుబ్బరాయుడు, నారాయణ, రామక్రిష్ణ, అసోషియేషన్ సభ్యులు, వినియోగాదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కౌలు రైతు సదస్సులు

ఆత్మకూరురూరల్ , మే 12(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో మే13వ తేదీ నుండి 19వ తేది వరకు కౌలు రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి డి. విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు.ఆయా గ్రామాలలోని కౌలు రైతులందరూ ఈ సదస్సుకు హాజరై రైతు సేవా కేంద్రం నందు గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహానందిలో నగర సంకీర్తన

మహానంది, మే 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఉదయం సమరతసేవా ఫౌండేషన్ సభ్యులు నగర సంకీర్తను నిర్వహించారు. మూర్తల జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆలయం చుట్టూ భజనలు చేస్తూ నగర సంకీర్తనను భక్తి శ్రద్ధలతో జరిపారు.

శ్రీశైలంలో వైభవంగా గిరి ప్రదక్షిణ

శ్రీశైలం, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం పౌర్ణమి ఘడియలు రావడంతో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహామంగళ హారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షిణ నిర్వహించారు.

● శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు.

●శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనను జరిపించారు.



గిరి ప్రదక్షిణ కార్యక్రమం

● శ్రీశైల క్షేత్రంలో లోకకళ్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

నంద్యాల వాసికి 'కవిరత్న' పురస్కారం



'కవిరత్న' పురస్కారం అందుకుంటున్న రఫీ

నంద్యాల కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న రఫీ దశాబ్దకాలంగా వివిధ పత్రికలకు వ్యాసాలు, కవితలు రాస్తూ రచయతగా గుర్తింపు పొందారు. రఫీ సాహితీ సేవలను గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రసాద్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, కన్వీనర్ కొల్లు రమావతి సోమవారం ఏలూరులోని మహాలక్ష్మీ కళ్యాణమండపంలో 'కవిరత్న' జాతీయ ప్రతిభా పురష్కారం ప్రదానం ఘనంగా సత్కరించారు. పురష్కారం అందుకున్న రఫీని వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ రవీంద్రనాద్, డా. హయగ్రీవాచార్యులు, డా. గెలివి సహదేవుడు, డా. రమణమూర్తి, డా. కిషోర్ కుమార్, ముర్తుజా, సమద్, శ్రీనివాసమూర్తి, శ్రీనివాస రెడ్డి, మాబుబాషా అభినందించారు.

సమ్మెను విజయవంతం చేయండి

నందికొట్కూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యల పరిష్కారానికై కార్మిక కోడ్స్ రద్దుకై 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను అంగన్‌వాడీ వర్కర్స్ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు టి.గోపాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు డి.మదార్‌బీ పిలుపునిచ్చారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ లక్ష్మీదేవి, లత, సువర్ణమ్మ, లలితమ్మ, గాయత్రీ, కాత్యాయని, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల్లో పోషక విలువలు

మహానంది, మే 12 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని మహానంది ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. దళిత మహిళలకు పోషకాహారం, ఆర్థిక సాధికారికత అనే పథకంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. సోమవారం పుట్టగొడుగుల వల్ల కలిగే పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలపై వివరించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రైనర్స్ రవికుమార్, ఓఎస్ఏ విజయభాస్కర్‌తో పాటు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆటోపై విరిగి పడిన భారీ వృక్షం

మిడుతూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం వద్ద ఉన్న భారీ వేప చెట్టు విరిగి అక్కడ ఆగిన ఆటోపై పడింది. ఎవరూ అక్కడ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇటీవల ఈదురు గాలకు దెబ్బతిన్న చెట్టు సోమవారం విరిగి పడినట్లు స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ పనులు చేపట్టారు.

ఈఈపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కాలుష్యం ఈఈపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామంలో ఉండే రాంకో సిమెంట్ ప్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం పట్టించుకోకుండా సుమారుగా 400 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దీంతో పంట దిగుబడి రాక కోట్ల రూపాయాలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండలంలోని గీత కులాల మద్యం దుకాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన గెజిట్ ప్రకారం ఈనెల 15 వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఈ దరఖాస్తు గతంలో టెండర్ వేసినప్పటికీ ఇక్కడికి ఎవరు రాకపోవడంతో మళ్లీ టెండర్ వేస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారులు ఎవరైనా ఉంటే నందికొట్కూర్ సీఐని సంప్రదించాలని కోరారు.

15వ రోజుకు చేరిన సీహెచ్‌వోల నిరవధిక సమ్మె

నంద్యాల హాస్పిటల్, మే 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. వేతన సవరణ, ప్రావిడెంట్‌ఫండ్‌పై అసోసియేషన్ నాయకులతో చర్చలు జరిపి పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, కార్యదర్శి అఖిల్, భార్గవ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలను సవరించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ చేపట్టిన సంస్కరణల్లో లోపాలను సవరించాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు ప్రసాద్, సుధాకర్‌లు మాట్లాడుతూ విద్యాశాఖ చేపట్టబోతున్న తొమ్మిది రకాల పాఠశాలలు గందరగోళానికి దారితీస్తోందని, గతంలో ఉన్న మూడు రకాల వ్యవస్థను అమలు చేయాలని కోరారు. బదిలీలు జరుపుతున్నామని కాలయాపన చేస్తున్నారే కాని ఇంతవరకు ఒక్క జీవో కూడా విడుదల కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీసు బేరర్లు సుబ్బారాయుడు, శాంతిప్రియ, సుజాత, షమీం బాను తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పల్లకీ ఉత్సవం

మహానంది, మే 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పల్లకిసేవ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు నిర్వహించారు. సోమవారం రాత్రి పౌర్ణమి చంద్రుని వెలుగుల్లో ప్రత్యేక పల్లకిలో స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంత్ శర్మ,అర్చకులు పుల్లారి జనార్దన్‌శర్మలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

గడివేముల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ప్రజలకు గ్రామ పెద్దలు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మహిళలు స్వామివారికి పుష్పార్చన చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా చిన్నారులు చేసిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.

దేవదాయ శాఖ భూముల వేలం పూర్తి

పాణ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): పాణ్యం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని భూముల వేలాలు సోమవారం నిర్వహించారు. ఈ వేలాలు దేవాదాయ శాఖ ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రామస్వామి ఆలయానికి చెందిన 29. 96 ఎకరాలకు రూ. 2. 57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. వీరనారాయణస్వామి ఆలయానికి చెందిన 28. 27 ఎకరాలకు రూ. 2. 89 లక్షలు, పాణికేశ్వరస్వామి ఆలయానికి చెందిన 41. 52 ఎకరాలకు 1. 86 లక్షలు, పడవెంకటాద్రి ఆలయానికి చెందిన 9. 19 ఎకరాలకు రూ. 1. 22 లక్షలు సత్యనారాయణస్వామి ఆలయానికి చెందిన 1. 52 ఎకరాలకు వేలాలు నిర్వహించగా 1. 86, 500ల ఆదాయం చేకూరినట్లు తెలిపారు. వేలాలలో 51 మంది పాల్గొన్నట్లు తెలిపారు. గత వేలాల కంటే ఈ ఏడాది రూ. 2.92 లక్షల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఈవో గోపి, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

నంద్యాల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నంద్యాల టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమం 90 రోజుల ఉంటుందన్నారు. 80 శాతం హజరు ఉంటుందో వారికి కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్, శిక్షణ కేంద్రాల సూపర్‌వైజర్ బాలహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కమనీయం..చెన్నకేశవస్వామి కల్యాణం


రథాన్ని లాగుతున్న భక్తులు

బేతంచెర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబాయి గ్రా మంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని అర్చకుడు గోపాలయ్య వేదమంత్రోచ్ఛర ణాలతో సోమవారం నిర్వహిం చారు. వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి హాజరైన భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి లాగారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: సీఐ


రోడ్డును పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తమవంతు చర్యలు చేపడుతున్నట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బా పాఠశాల మలుపు వద్ద రహదారి క్లీనింగ్ పనులను సోమవారం చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో రహదారికి ఇరువైపులా కంపచెట్లు తొలగించారు. మలుపు వద్ద అతి వేగం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సీఐ రమేష్‌బాబు సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రాచెర్లలో గురువులతో పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం వారు చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలలో షెడ్ నిర్మాణానికి రూ. 45వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు శివ నాగరాజు, ఉమాశంకర్, శివశంకర్‌రెడ్డి, రామన్ననాయక్ పాల్గొన్నారు.

గోవిందపల్లెలో..

శిరివెళ్ల : మండలంలోని గోవిందపల్లె గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గోవిందపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 2001-02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులను సత్కరించి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి ఆదోనికి చెందిన గుమ్మనూరు రాజేశ్వరి కుటుంబ సభ్యులు సోమవారం విరాళం అందించారు. ఆలయాభివృద్ధి కోసం రూ. 1.50లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.ఉమార్ రెడ్డికి అందించారు. కార్యక్రమంలో పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో చెత్త వేస్తే చర్యలు

కొలిమిగుండ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారంగా చెత్త వేస్తే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని పెట్నికోట పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి హెచ్చరించారు. సోమవారం గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఉప్పులపాడు రహదారిలో ఉన్న చెత్త, మురుగును తొలగించి, శుభ్రం చేయించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శేష వాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య, వేద పండితులు సంబటూరు వేణుగోపాలచారి, సంబటూరు సుదర్శనాచారి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో బండలాగుడు పోటీలు

కోవెలకుంట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఒంటెద్దు బండి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య, కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పెనుగొండ రాజశేఖర్, మురళీతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దమయంతి

బనగానపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. మ్యాథ్స్ ఉపాధ్యాయుడు గురువారెడ్డి స్మారకార్థం పూర్వ విద్యార్థులు, గ్రామస్థుల సహకా రంతో పోటీలు నిర్వహించారు. గురవారెడ్డి సతీమణి దమయంతి మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభించగా, పురుషుల కబడ్డీ పోటీలను మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, రిటైర్డు హెచ్ఎం పక్కీర్‌రెడ్డి ప్రారంభించారు. తమిళనాడు, హర్యానా, ఏపీలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, దమయంతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాణ్యం ఎంఈవో సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకుడు శంకర్, యువకులు పాల్గొన్నారు.

నిఘా నేత్రానికి ఏమైంది?

- పనిచేయని సీసీ కెమెరాలు
- అస్తవ్యస్తంగా నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

ఆళ్లగడ్డ, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిఘా నేత్రంపై నీలినీడలు కమ్ముకున్నాయి. శాంతిభద్రత పరిరక్షణలో కీలకంగా వ్యవహరిం చే సీసీ కెమెరాలు కొన్ని రోజులుగా పనిచేయ డం లేదు. పట్టణంలో 2022వ సంవత్సరంలో ప్రజలు, వ్యాపారుల సహకారంతో పోలీసు శాఖ ప్రధాన రోడ్లు, కూడళ్లను గుర్తించి 70కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని పట్టణ పోలీస్ స్టేషన్‌లోని టీవీలకు అనుసంధానం చేశారు. పట్టణంలో ఎక్కడ చోరీ, ఇతర సంఘటనలు జరిగినా పోలీసుల దర్యాప్తుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉండేది.

కేబుల్స్ కట్ కావడం..

కొన్ని నెలలుగా పట్టణంలో అమర్చిన సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కెమెరాలకు సంబంధించిన కేబుల్స్ కట్ కావడం, స్తంభాలకు అమర్చిన సామగ్రి కాలిపోవడం, వర్షం నీరు చేరి అవి పూర్తిగా పనిచేయకుండా పోయాయి. సీసీ కెమెరాలు అమర్చిన కంపెనీ వారు సర్వీస్ అందించక పోవడంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలోని కెమెరాలు పనిచేయడం లేదు. పట్టణంలోని పాతబస్టాండ్ ఏవీ హోటల్, నాలుగు రోడ్ల కూడలిలో కొన్ని కెమెరాలు కిందికి ఒరిగిపోయాయి. కొన్ని కాలనీలలోని సీసీ కెమెరాలు మాయమైనట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న నేరాలు

పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. ఇటీవల ఆళ్లగడ్డ ప్రధాన రోడ్డులో (టీబీ రోడ్డు) ఒక బాలుడు తప్పిపోయాడు. సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పనిచేయనట్లు తెలిసింది. ఇటీవల ఎమ్మెల్యే భూమా ఇంటి బయట గన్‌మెన్‌పై దాడి చేశారు. ఎప్పుడు ఏదో ఒకటి జరిగే ఆళ్లగడ్డలో సీసీ కెమెరాలు పని చేయక పోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిఘా నేత్రాలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పాత బస్టాండ్‌లో చెట్టు ఆకుల మధ్యలో పని చేయని సీసీ కెమెరా


ఏవీ హోటల్ ఎదుట అలంకార ప్రాయంగా ఉన్న కెమెరాలు


పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో కిందికి ఒరిగిన కెమెరాలు

చర్యలు తీసుకుంటాం

ఆళ్లగడ్డ పట్టణంలో సీసీ కెమెరాల పనితీరు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటాం. ఇది ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ త్వరలోనే సీసీ కెమెరాలు అన్ని పని చేసేలా చేయిస్తాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మెయింటెనెన్స్‌లేక పని చేయలేదు.
- యుగంధర్, టౌన్ సీఐ, ఆళ్లగడ్డ

ఆలయ భూములను ఎలా కట్టబెడతారు?

- భూములిచ్చిన రైతులను మోసం చేస్తున్న సిమెంట్ కంపెనీలు
- సీపీఐ జిల్లా నాయకులు, రైతుల నిరసన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతులు

కొలిమిగుండ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభలు లేకుండా, రైతుల అనుమతి లేకుండా దేవాలయ భూములను సిమెంట్ పరిశ్రమ ల కు ఎలా కట్టబెడతారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా రైతు సంఘం నాయకులు సోమన్న ప్రశ్నించారు. కల్వటాల గ్రామానికి చెందిన దేవాలయ భూములను రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు కౌలుకు అప్పగించడంపై స్థానిక రైతులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ బాలీశ్వర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పిన పరిశ్రమ వర్గాలు ఇప్పటి వరకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిజం, అల్ట్రాటెక్, పెన్నా, రామ్‌కో సిమెంట్ పరిశ్రమల ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలను మరిచాయని ఆరోపించారు. వెంటనే పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పుల్లయ్య, గుజ్జల పెద్దయ్య, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

బేతంచెర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో పట్టణ జనరల్ బాడీ సమావేశం నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహిం చా రు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను అడ్డుకోకపోతే కార్మికుల భవిష్యత్తు అంధకారమే అవుతుందన్నారు. ఇప్పుడు ఉన్న కొద్ది భద్రత కూడా లేకుండా 29 కార్మిక చట్టాలు రద్దు అవుతాయన్నారు. ఇప్పుడున్న 42 కార్మిక చట్టాలు పోరాడి సాధించుకున్నవేనన్నారు. అన్నింటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. లేబర్ కోడ్స్‌పై యావత్ కార్మిక వర్గం ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెకు సిద్ధమవుతుందన్నారు. జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య, రామాంజనేయులు, సంజీవరాయుడు, వైబీ వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా వై.ఎల్లయ్య, అధ్యక్షుడిగా సంజీవనాయుడు, ట్రెజరర్‌గా సీహెచ్ మద్దిలేటి స్వామి, సహాయ కార్యదర్శులుగా మద్దిలేటి, జి.వేణుగోపాల్, నాగేంద్రమ్మ, నరసింహుడు, ఎస్కే బాషా, జి.షేభా, ఉపాధ్యక్షులుగా బి.రామాంజనేయులు, ఎస్.ఖాజాబాషా, పి.వెంకటరమణ, కే.రాజబాబు , కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు.

ప్రహరీ తొలగింపు


ప్రహరీని ఎక్స్‌కవేటర్‌తో గోడను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

బేతంచెర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఆక్రమించి ఓ ఇంటి యజమాని నిర్మించిన ప్రహరీని నగర పంచాయతీ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సోమవారం తొలగించారు. పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో నివాసముంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి రాజారావు ఇంటి ముందు ఉన్న రోడ్డు స్థలాన్ని ఆక్రమించి కాంపౌండు నిర్మించుకున్నారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ, నగర పంచాయతీ అధికారులు సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేసినా బేఖాతరు చేశారు. ఇటీవల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ మరోమారు నోటీసులు జారీ చేసినా ఇంటి యజమాని స్పందించలేదు. దాంతో కమిషనర్ ఆదేశాల మేరకు నగర పంచాయతీ సిబ్బంది ఎక్సవేటర్‌తో తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎస్ఐ రమేష్‌బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఉరుసు

ఉయ్యాలవాడ, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చకాయపల్లె గ్రామం సమీపంలో ఉన్న బాబానగర్ దర్గా ఉరుసు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజారత్ హాజీ జహీరుద్దీన్ షా ఖాద్రిలకు గంధం సమర్పించారు. మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు దర్గా పీఠాధిపతులు బాబా గఫార్ సాహెబ్ షా ఖాద్రి, బాబా దస్తగిరి సాహెబ్ షా ఖాద్రీ తెలిపారు. బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వైభవంగా పల్లకీ సేవ

బనగానపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరీమాత ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని పల్లకీసేవలో ఊరేగించారు. అలాగే సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్యాపిలి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఎస్ఐ మధుసూదన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అధిక లోడుతో, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. లేనిపక్షంలో శాఖపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మొక్కల సంరక్షణ ఏదీ?

- హైవేపై ఎండుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


ప్యాపిలి సమీపంలోని హైవేపై ఎండిపోయిన మొక్కలు

ప్యాపిలి, మే 12 (ఆంధ్రజ్యోతి): అడువులు పెంచుదాం.. పచ్చదనాన్ని కృషి చేద్దామన్న నేతల మాటలు నీటిమూటలు అయ్యాయి. ఇందుకు నిదర్శనమే హైవేలపై ఎండుతున్న మొక్కలు. మండలంలోని ప్యాపిలి, పోతుదొడ్డి, ఏనుగమర్రి, వెంగళాంపల్లి తదితర గ్రామాల మీదుగా 44వ జాతీయ రహదారి వెళ్తుంది. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో డివైడర్‌లో పచ్చదనం కోసం నాటిన మొక్కలకు నీరు అందక ఎండిపోతున్నాయి. నెలల తరబడి పరిస్థితి ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. హైవేపై ప్రయాణిస్తున్న ప్రజలు ఎండవేడిమికి బెంబేలు ఎత్తిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హైవే మొక్కలకు నీరందించి పచ్చదనాన్ని కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాంసాహారులకు చుక్కలు

- పెరిగిన మటన్ ధరలు
- కొండెక్కిన చికెన్ ధరలు

కొలిమిగుండ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాంసాహారులకు చికెన్, మటన్ ధరలు చుక్కలు చూపుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలను చూసి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. మటన్‌ను సామాన్యులు ముట్టుకోవాలంటనే హడలెత్తిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాది క్రితం రూ.600 పలికిన మటన్ ధర, ప్రస్తుతం రూ.1000కు చేరింది. కొన్ని నెలల క్రితం బర్డ్‌ఫ్లూతో తగ్గిన చికెన్ ధరలు మళ్లీ కొండెక్కాయి. కిలో చికెన్ రూ.250 నుంచి రూ. 300వరకు చేరింది.

ధరలపై నియంత్రణ ఏదీ?

మటన్, చికెన్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న వీటిని నియంత్రించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ధరల నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ధరలను అమాంతం పెంచేస్తున్నారు. దీనితో మాంసం ప్రియులు దోపిడీకి గురవుతున్నారు.


కొలిమిగుండ్లలో మటన్ కోసం ఎగబడిన వినియోగదారులు(ఫైల్)

వైభవంగా గరుడోత్సవం


వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం చేశారు. సంజీవరాయస్వామికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన నటరాజ కళా క్షేత్రం కళాకారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఉద్యోగులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పంటకు రక్ష

చాగలమర్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సూక్ష్మపోషకాలను గుర్తించేందుకు ఉచితంగా భూసార పరీక్షలు చేస్తున్నామని ఏవో రంగనేతాజీ అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలో ఏఈవో మంజుల పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ సుబ్బరాయుడు, వీఆర్ఏ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

18న దస్తగిరి స్వామి ఉరుసు

చాగలమర్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కట్టమీది దస్తగిరిస్వామి ఉరుసు ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న మౌలాలి ఇంటి నుంచి గంధమును ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకెళ్లి ఫాతెహాలు సమర్పిస్తామన్నారు. 17న ఉరుసు ఉంటుందన్నారు. అలాగే ఒంటెద్దుల బండపందెం ఏర్పాటు చేశామన్నారు. 18న ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

గొడిగనూరులో క్రికెట్ పోటీలు

చాగలమర్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరులో యువత ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సూపర్‌క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు సుబ్బరాయుడు, గణేష్, చైతన్య సోమవారం తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు నగదును దాతలు అందజేస్తారన్నారు. 17న క్రీడాకారులు రూ.1,000 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు.

గ్రామాల్లో జాతర ప్రారంభం

రుద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లవాగుపల్లెలో మారెమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పూజలు చేశారు. గ్రామంలో పోతు గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఇళ్లకు బంధువులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. అలాగే యల్లావత్తుల గ్రామంలో గంగమ్మ జాతర పూజలు ప్రారంభించారు. గ్రామంలో దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల గ్రామోత్సవం చేశారు.

గురప్పస్వామి సన్నిధిలో టీడీపీ నాయకుడు

రుద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట సమీపంలో ఉన్న గురప్పస్వామి ఆలయాన్ని సోమవారం టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భార్గవరామ్‌నాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు తిరుపాలు ఆయనకు స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు.

పాఠశాలకు కూలింగ్ వాటర్ ట్యాంక్ వితరణ

ఆళ్లగడ్డ, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ భారతీ విద్యా మందిరం పాఠశాలకు పూర్వ విద్యార్థి వంగల సుదర్శన్‌రెడ్డి సోమవారం కూలింగ్ వాటర్ ట్యాంక్ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సావిత్రమ్మ, భారతీ విద్యా మందిరం పాఠశాల అధ్యక్షుడు రవికాంత్ చౌదారి, కార్యదర్శి గుండా శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల పాలకవర్గ కమిటీల నియామకానికి దరఖాస్తులు

శిరివెళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు, యర్రగుంట్ల గ్రూపు దేవాలయాల పరిధిలోని పలు ఆలయాలకు నూతన పాలకవర్గ కమిటీల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈవోలు రామాంజనేయ శర్మ, బీవీ నరసయ్య సోమవారం తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 25లోగా నంద్యాలలోని దేవాదాయశాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. నోటిఫికేషన్ వివరాలకు సంబంధిత ఆలయాల ఈవో కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

ఆలయ భూములకు బహిరంగ కౌలు వేలం

శిరివెళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు 2025-26 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమితితో బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ సోమవారం తెలిపారు. కోటపాడు, చెన్నూరు, బోయలకుంట్ల, శిరివెళ్ల గ్రామాల పరిధిలోని ఆయా ఆలయాలకు సంబంధించిన భూములకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నబోధనం గ్రామంలో..

చాగలమర్రి: మండలంలోని చిన్నబోధనం గ్రామంలో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములను సోమవారం దేవాదాయశాఖ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన 37.50 ఎకరాల భూమిని ముగ్గురు రైతులు కలిసి రూ.2.80 లక్షల కౌలుకు దక్కించుకున్నారు. ఎస్ఐ సురేష్ బందోబస్తు చేపట్టారు.

ముగిసిన లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు

డోన్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాపదిన్నె గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్ల సోమవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల చివరిరోజు ఆలయంలో చెక్కభజన కార్యక్రమాలు అలరించాయి. ఆలయంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు బహుమతులు గ్రామపెద్దల ఆధ్వర్యంలో అందజేశారు. అలాగే గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూకొత్తపల్లె వైద్యాధికారి ఉసేన్ సూచించారు. సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

వాహనాల తనిఖీ

- రూ.3,97,310 జరిమానా విధించిన ఆర్టీఏ అధికారులు

డోన్ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలకు మోటారు వాహనాల తనిఖీ అధికారులు భారీ జరిమానాలు విధించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మైసూరు వెళ్తున్న చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మినీ వ్యాన్‌కు రూ. 61,410 జరిమానా విధించారు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన గూడ్స్ వెహికల్ రూ.11,900, వీటితో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాకు సంబంధించిన ఆరు ఓవర్ లోడుతో పట్టుబడిన లారీలకు రూ. 3,24,000 జరిమానా విధించినట్లు ఆర్టీవో టి.క్రాంతి కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్టీఏ పోలీసు సిబ్బంది ఉన్నారు.